# ప్రత్యేకహోదాపై కేంద్రానికి నివేదించండి

## గవర్నర్‌కు అమరావతి జెఎసి వినతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేకహోదా అనివార్యమని, దీనిపై కేంద్రానికి నివేదిక పంపాలని గవర్నర్ బిబి హరిచందన్‌కు అమరావతి జెఎసి ఛైర్మన్ బొప్ప రాజు, జెఎసి రాష్ట్ర సభ్యులు వినతిపత్రం ఇచ్చారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో అమరావతి జెఎసి నాయకులు గవర్నర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనుభవజ్ఞులైన వ్యక్తి ఎపికి మొదటి గవర్నర్‌గా రావడం సంతోషంగా ఉందని, రాష్ట్ర ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉపాధ్యాయుల తరపున గవర్నర్‌కు జెఎసి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందని, ప్రత్యేకహోదా వస్తేనే ఎపి ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందని వివరించారు. విభజన చట్టంలో పొందుపర్చిన విభజన హామీలన్నీ నెరవేర్చేలా దష్టి సారించాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో అమరావతి జెఎసి నాయకులు వివి మురళీకష్ణనాయుడు, జి వి నారాయణరెడ్డి, కె ఆల్ఫ్రెడ్, డిఎస్ కొండయ్య, జె శ్రీనివాసరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నారు.



స్కూల్ స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న సిఐటియు నాయకులు గఫూర్, స్వరూపరాణి ఉమామహేశ్వరరావు తదితరులు

# స్కూల్ స్వీపర్లకు వేతన బకాయిలు విడుదల చేయాలి

## సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 22వేల మంది స్కూల్ స్వీపర్లకు 26 నెలలుగా వేతనాలు చెల్లించడంలేదని, తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో స్కూల్ స్వీపర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఎ గఫూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నెలకు కేవలం రూ.2 నుంచి 4 వేలు వేతనం ఇస్తూ, రోజుకు 9 గంటలు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వీపర్లకు ఇచ్చే నామమాత్రపు వేతనాలు కూడా 14-26 నెలలు పెండింగ్‌లో పెట్టడం దారుణమన్నారు. గత ప్రభుత్వం వేతన నిధులను పక్కదారి పట్టించిందని, కొత్త ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందనుకుంటే అటువంటి చర్యలేవీ తీసుకోవడం లేదని తెలిపారు. స్కూల్ స్వీపర్ల వ్యవస్థను వైసిపి ప్రభుత్వం రద్దు చేయాలనే యోచనలో ఉందని వార్తలొస్తున్న నేపథ్యంలో స్వీపర్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. స్వీపర్లకు రూ.18 వేలు వేతనం ఇస్తామని సిఎం చేసిన ప్రకటనతో స్వీపర్లంతా సంతోషించారని, ఇప్పుడు స్వీపర్ల వ్యవస్థనే రద్దు చేయాలని చూడడం కార్మికులకు అన్యాయం చేయడమే అవుతుందని అన్నారు. స్కూల్ స్వీపర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన 26 నెలల వేతనాలు చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా నెలకు రూ.18 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె స్వరూపరాణి, రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, కోటేశ్వరరావు, కొండలరావు తదితరులు మాట్లాడారు.

# రేపటి నుంచి పవన్‌కళ్యాణ్ పశ్చిమగోదావరి పర్యటన

**ప్రజాశక్తి-అమరావతిబ్యూరో**

రేపటి నుంచి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రెండురోజుల పాటు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నాల్గో తేదీ మధ్యాహ్నానికి రాజమహేంద్రవరం చేరుకుని, అక్కడి నుంచి సిద్ధాంతం, పెనుగొండ మీదుగా భీమవరం చేరుకుంటారని పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారని తెలిపారు. క్యాన్సర్‌తో కన్నుమూసిన జనసేన కార్యకర్త కొప్పినీడు మురళీకృష్ణ కుటుంబాన్ని ఐదో తేదీ ఉదయం పరామర్శిస్తారని, మధ్యాహ్నం నరసాపురం పార్లమెంటరీ పరిధిలోని కార్యకర్తలతో ముఖా ముఖి సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

# పింఛన్లలోనూ అవకతవకలు?

- పెరుగుతున్న అనుమానాలు
- ఆరా తీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

నిరుపేదలకు అందించాల్సిన పింఛన్లలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయన్న అనుమానాలను తాజాగా అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కేటాయించిన నిధుల కన్నా వెయ్యి కోట్లు తక్కువగా ఖర్చుకావడమే దీనికి కారణం. . ఎనిమిది రకాల పింఛనుదారులకు గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో 28,634 కోట్లు కేటాయించగా, అందులో 27,539 కోట్లు ఖర్చు చేశారు. ఒకవైపు లబ్దిదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా, నిధుల వ్యయం తగ్గడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఎయిడ్స్ బాధితులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్స్, డయాలసిస్ రోగులకు ఏటా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఇందులో భాగంగానే 2014-15లో రూ.3609 కోట్లు కేటాయించగా, రూ.3378 కోట్లు ఖర్చు చేయగలిగారు. 2015-16లో రూ.5307 కోట్లను అధికారికంగా కేటాయించగా, అందులో రూ.5221 కోట్లు ఖర్చు చేశారు. 2016-17లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రూ.5477 కోట్లు కేటాయిస్తే రూ. 5270 కోట్లు ఖర్చయింది. 2017-18లో 5999 కోట్లకుగాను 5436 కోట్లు, గత ఏడాది 8241 కోట్లకు 8234 కోట్లు ఖర్చు చేశారు. లబ్దిదారులు మాత్రం 2014-15లో 41.3 లక్షల మంది ఉండగా, తాజాగా వారి సంఖ్య 52.9 లక్షలకు చేరుకుంది. లబ్దిదారులు పెరిగిన స్థాయిలో సాయం మొత్తం పెరగడం లేదని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిస్థితిపై నూతన ప్రభుత్వం ఆరా తీస్తోంది. కేటాయింపులకు అనుగుణంగా విడుదల చేయలేదా, లేదా కొంతమంది లబ్దిదారులకు పింఛన్లు అందించలేదా అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పింఛన్లు అందని లబ్దిదారులు ఎవరు, రాజకీయ కారణాలతో పింఛన్లు ఆపారా అన్నది కూడా తేలాల్సి ఉందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. టిడిపి హయాంలో చివరగా ప్రతిపాదించిన ఓట్ ఆన్ అక్కౌంట్‌లో పింఛనుదారుల కోసం కేటాయించిన నిధులు కూడా ఎందుకూ చాలలేదని తెలుస్తోంది. ఏప్రిల్ ఒకటి నుంచి నాలుగు నెలలపాటు ఆమోదించిన ఓట్ ఆన్ అక్కౌంట్‌లో పింఛన్ల కోసం రూ.2400 కోట్ల వరకు కేటాయించగా, అందులో ఇప్పటికే రూ.2200 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయితే జూలై నెలకు సంబంధించి ఇంకా ఎనిమిది వందల కోట్లు కావాల్సి ఉంటుందని, ఇప్పటికే మిగిలిన నిధులు పోను ఇంకా ఆరు వందల కోట్ల వరకు విడుదల చేయాలని సంబంధిత అధికారులు ఆర్థికశాఖను కోరుతున్నారు.

# 'నిమ్మగడ్డ' కు బెయిల్ మంజూరు

## సెర్బియా విడిచి వెళ్లరాదని షరతు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ పారిశ్రామిక వేత్త నిమ్మగడ్డ ప్రసాద్ ఎట్టకేలకు శుక్రవారం బెయిల్‌పై సెర్బియాలోని బెల్‌గ్రేడ్ జైలు నుంచి విడుదలయ్యారు. సెర్బియా విడిచి వెళ్లరాదని అక్కడి న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. వ్యక్తిగత పర్యటన నిమిత్తం సెర్బియా వెళ్లిన నిమ్మగడ్డ ప్రసాద్‌ను జులై 30న బెల్‌గ్రేడ్ విమానాశ్రయంలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లాలోని వాన్‌పిక్ పోర్టు వ్యవహారానికి సంబంధించి యుఎఇలోని రస్ అల్ ఖైమాలో కేసు నమోదైంది. ఈ వ్యవహారానికి సంబంధించి నిమ్మగడ్డ ప్రసాద్‌కు రస్‌అల్‌ఖైమా ఇన్‌వెస్ట్‌మెంట్ అథారిటీకు మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. దర్యాప్తులో భాగంగా ఆయనను విచారించాలన్నా, అరెస్టు చేయాలన్నా భారతదేశం అనుమతి తీసుకోవాలి. జగన్ అక్రమాస్తుల కేసులపై విచారణ సాగుతుండటంతో ఆయన్ను విదేశాలకు అప్పగించడానికి భారత్ అంగీకరించడం అనుమానమే! దీనిని దృష్టిలో ఉంచుకొని రస్‌అల్‌ఖైమా పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నిమ్మగడ్డ విదేశీ పర్యటనలపై కన్నేసి ఉంచారు. ఐరోపా పర్యటనలో ఉన్న సంగతి తెలుసుకున్న సెర్బియా పోలీసులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించి రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేశారు. నిమ్మగడ్డ బెల్‌గ్రేడ్ విమానాశ్రయంలో దిగగానే నోటీసులు ఆయన చేతిలోపెట్టి అరెస్ట్ చేశారు.

**హైదరాబాద్‌లోని ప్రత్యేక న్యాయస్థానంలో మెమో**

సెర్బియా పోలీసులు అరెస్ట్ చేయడంతో సిబిఐ ముందు ఉన్న వివిధ కేసుల్లో విచారణకు నిమ్మగడ్డ ప్రసాద్ హాజరు కాలేకపోతున్నారని ఆయన తరపు న్యాయవాదులు ప్రత్యేక న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. జగన్ అక్రమాస్తుల కేసు, వాన్‌పిక్‌తో పాటు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో నిమ్మగడ్డ హాజరు కావాల్సిన మరికొన్ని కేసులు కూడా ఉండటంతో ముందస్తుగానే ఈ సమాచారం ఇస్తున్నట్లు మెమోలో పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్రకు ఆనుకుని ఆవర్తనం

- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
- కోస్తాకు వర్ష సూచన

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**



ఉత్తరాంధ్ర-దక్షిణ కోస్తాకు, పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దాని ఉపరితలం నైరుతి వైపునకు వంగి ఉండటంతో కోస్తాలో పలుచోట్ల మోస్తరు జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ నెల నాలుగున ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడుతుందని, తర్వాత బలపడే అవకాశముందని ఐఎండి అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో ఒడిశా, తెలంగాణతో పాటు ఉత్తరాంధ్రలోనూ వర్షాలు కురిసే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. శుక్రవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగా, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిశాయి.

# పోలవరంలో దోపిడీపైనే చంద్రబాబు ఆలోచన

- నామినేషన్ పద్ధతిలో ట్రాన్స్‌ట్రాయ్‌కు అప్పగింత
- అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



పోలవరం ప్రాజెక్టులో దోపిడీ గురించే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించారని రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. వైసిపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసాలకు, అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చినా, ఆయన తీరులో మార్పులేదని వ్యాఖ్యానించారు. పోలవరం పూర్తి చేయాలనే ఆలోచన మొదటి నుంచి చంద్రబాబుకు లేదని, దోపిడీకి తీసుకున్న కార్యక్రమమని విమర్శించారు. పోలవరం మొదలు పెట్టిందని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, పూర్తి చేసేది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఉన్న సమయంలోనే నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయిస్తారని, ఏళ్ల పాటు జరిగే పనులను నామినేషన్ పద్ధతిలో ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇక్కడే పెద్ద అవినీతి జరిగిందని అర్థమవుతుందని, ఈ విషయాన్నే టెక్నికల్ కమిటీ తేల్చిందన్నారు. నామినేషన్ పద్ధతిలో ఎలా ఇచ్చారని టెక్నికల్ కమిటీ ఇచ్చిన రిపోర్టుపై మాత్రమే నోటీసులు ఇచ్చారని, దీనిపై చంద్రబాబుకు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో సాగునీటి రంగంలో అవినీతి పెద్ద ఎత్తున జరిగిందని విమర్శించారు. వేల కోట్లు ఖర్చు చేసినా ఎందుకు ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. వైఎస్ హయాంలో చెల్లించిన పరిహారం తప్ప ఒక్క ఎకరానికి కూడా చంద్రబాబు పరిహారం చెల్లించలేదన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న జగన్

## ఎపిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

జగన్ కెసిఆర్ చేతిలో కీలుబొమ్మగా మారి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఎపిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి అన్నారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి మిగులుజలాలు శ్రీశైలానికి తరలించి రెండు రాష్ట్రాలు వాడుకునేలా కెసిఆర్ చేసిన ప్రతిపాదనతో రాష్ట్రం శాశ్వతంగా ఎడారిగా మారుతుందని, ఇది రాష్ట్రానికి తీరని నష్టం కలిగిస్తుందని చెప్పారు.

**పింగళి వెంకయ్యకు ఎపిసిసి నివాళి**

జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 143వ జయంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఎపిసిసి నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

# గోదావరి జలాలపై అఖిలపక్షం

- సిపిఐ రామకృష్ణ డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



గోదావరి జలాల వినియోగంపై ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రులిద్దరూ చర్చించుకుంటే సరిపోదని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయపార్టీలు, సాగునీటిరంగ నిపుణులు, ఇంజనీర్లు, రైతుసంఘాల నాయకులు, మేధావులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోదావరి జలాల వినియోగ అంశం రాష్ట్ర ప్రజలందరికి సంబంధించినదని, దీనిపై ఉన్న అపోహలు తొలగించాల్సిన బాధ్యత సిఎంకు ఉందన్నారు. ఒకవైపు రాష్ట్రంలో కొత్తగా 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ, మరోవైపు ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధపడడం దారుణమన్నారు. గత 5 సంవత్సరాలకు పైగా విధులు నిర్వర్తిస్తున్న ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విఓఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, రిసోర్స్ పర్సన్, పశుసఖి, బీమామిత్ర వంటి పలువురు చిరుద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగు లకు ఉద్యోగ భద్రత కరువై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఉద్యోగుల విషయంలో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చి, కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీని నాలుగైదు విడతల్లో చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా రైతులను ఆదుకుంటుం దేమో అని చూస్తున్న రైతులకు నిరాశే మిగిలిందని విమర్శించారు. ఇసుక పాలసీ విషయంలో ప్రజలు, కార్మికులను ఇబ్బందిపెట్టే పద్ధతుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కొనసాగడం విచారకరమన్నారు. ప్రభుత్వ పథకాలకు దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల పేర్లు, ఫొటోలు ఎందుకు పెట్టడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు, రాష్ట్ర కార్యదర్శివర్గ పి హరనాథరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

# స్వలాభం కోసమే పోలవరం పంచాయితీ

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



స్వలాభం కోసమే పోలవరం 'పంచాయితీ' చేస్తున్నారని, కాంట్రాక్టు సంస్థ 15 రోజుల్లో అకౌంట్లు సెటిల్ చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. మట్టిపనులు, విద్యుత్తు ప్రాజెక్టును తమ అనుచరులకు కట్టబెట్టేందుకేనని ఆయన ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో వైసిపి తొలి నుంచి దుష్ప్రచారం చేసిందని, ఎట్టకేలకు పులివెందుల పంచాయితీ ద్వారా పనులు అడ్డుకునే ప్రయత్నానికి తెరలేపార న్నారు. పోలవరం టెండర్లపై ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని దేవినేని తప్పుపట్టారు. నిపుణుల కమిటీ రిపోర్టు బయట పెట్టకుండా పనులను రద్దు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. 77శాతానికిపైగా టిడిపి ప్రభుత్వమే పూర్తి చేసిందని, ట్రాన్స్‌ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగానే నవయుగ కంపెనీకి పనులు అప్పగించామన్నారు. కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు, ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పోలవరం కట్టామన్నారు. అవినీతి పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా పనులు ఎలా ఆపుతారని ఆయన ప్రశ్నించారు.

# రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

## కేంద్ర మంత్రులకు టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి విజ్ఞప్తి

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షాలను కలిసి విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా వారికి టిటిడి తీర్థ ప్రసాదాలను అందించారు. రాష్ట్రానికి ఇతోధికంగా నిధులిచ్చి ఆదుకోవాలని , విభజన హామీలను పూర్తిగా నెరవేర్చాలని విన్నవించారు.

# వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ కేటాయించాలి

- విశాఖపట్నం ఎంపి ఎం.వి.వి సత్యనారాయణ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ కేటాయించాలని విశాఖపట్నం ఎంపి ఎం.వి.వి సత్యనారాయణ కోరారు. శుక్రవారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తుతూ, నవరత్నాల్లో ఒకటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు లేకపోవడం దారుణమన్నారు. ఒరిస్సా మినరల్ డవలప్‌మెంట్ ఐరన్ ఓర్‌ను ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు.

కేంద్రం కూడా దీనిపై దృష్టి పెట్టాలని తెలిపారు. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని మిత్రగుంటలో కాంక్రీట్ స్లీపర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారని, 11 వందల ఎకరాల భూమిని కూడా కేటాయించారని తెలిపారు. 2005లో దీన్ని మంజూరు చేశారని చెప్పారు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు లేవని అన్నారు. ఈ ప్రాజెక్టు డీజిల్, ఎలక్ట్రికల్ లోకో మోటర్స్‌ను ఉత్పత్తి చేస్తుందని, కనుక ఈ ప్రాజెక్టును త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల ఎంపి బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య స్వగ్రామంలో భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో మరెక్కడా అంతకంటే పెద్ద జెండా ఎగురవేయకూడదని జాతీయ జెండా కోడ్‌ను సవరించాలని కోరారు. ఆగస్టు 2న ఆయన జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగుల వేయాలని కోరారు. పింగళి వెంకయ్య స్వాతంత్రోద్యమకారుడని, సామాజిక వేత్తని తెలిపారు.

**ఆనకట్టల పరిరక్షణ బిల్లుకు మద్దతు : మార్గాని భరత్, వైసిపి**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆనకట్టల పరిరక్షణ బిల్లుకు తమ పార్టీ మద్దతు తెలుపుతుందని వైసిపి ఎంపి మార్గాని భరత్ పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్ ప్రవేశపెట్టిన ఆనకట్టల పరిరక్షణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ, ఈ బిల్లు డ్యాముల రక్షణకు ఉపయోగపడుతుందని అన్నారు. నీటి అంశం రాష్ట్రానికి సంబంధించినదని పేర్కొన్నారు. పోలవరం నిర్మాణానికి నిధులకు ఇవ్వాలని కేంద్ర జలశక్తి మంత్రిని కోరారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**Laurus Labs Limited**

**Regd.Office:** Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
**Corporate Office:** 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.
Tel: +91 40 3980 4333 ; Fax: +91 40 3980 4320 ; E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

**(CIN: L24239AP2005PLC047518)**

Extract of Unaudited Consolidated Financial Results of Laurus Labs Limited for the quarter ended June 30, 2019 prepared in compliance with Indian Accounting Standards.

(₹ in millions)

| SL. No. | Particulars | Quarter ended | | | Year ended |
|---|---|---|---|---|---|
| | | 30-Jun-19 | 31-Mar-19 | 30-Jun-18 | 31-Mar-19 |
| | | (Unaudited) | (Audited) | (Unaudited) | (Audited) |
| 1 | Total revenue from operations | 5,505.69 | 6,351.61 | 5,390.17 | 22,919.16 |
| 2 | Net Profit for the period (Before tax, Exceptional and/or Extraordinary items) | 193.88 | 525.69 | 226.24 | 1,197.52 |
| 3 | Net Profit for the period before tax (After Exceptional and/or Extraordinary items) | 193.88 | 525.69 | 226.24 | 1,197.52 |
| 4 | Net Profit for the period after tax (After Exceptional and/or Extraordinary items) | 150.95 | 431.79 | 165.58 | 937.64 |
| 5 | Total Comprehensive Income for the period | 157.31 | 441.08 | 151.83 | 900.90 |
| 6 | Equity Share Capital | 1,064.37 | 1,064.37 | 1,060.30 | 1,064.37 |
| 7 | Reserves (Excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet | | | | 14,519.70 |
| 8 | Earnings Per Share (of ₹ 10/- each) | | | | |
| | 1. Basic : ₹ * | 1.42 | 4.07 | 1.56 | 8.83 |
| | 2. Diluted : ₹ * | 1.41 | 4.05 | 1.55 | 8.80 |

* *Not annualised for quarter ended*

**Notes:**

1. Additional information on Unaudited standalone financial results for the quarter ended June 30, 2019

(₹ in millions)

| SL. No. | Particulars | Quarter ended | | | Year ended |
|---|---|---|---|---|---|
| | | 30-Jun-19 | 31-Mar-19 | 30-Jun-18 | 31-Mar-19 |
| | | (Unaudited) | (Audited) | (Unaudited) | (Audited) |
| 1 | Total revenue from operations | 5,412.63 | 6,176.37 | 5,311.01 | 22,361.48 |
| 2 | Profit before tax | 212.59 | 544.48 | 218.22 | 1,212.19 |
| 3 | Profit after tax | 170.30 | 439.48 | 159.30 | 949.94 |
| 4 | Total Comprehensive Income for the period | 177.44 | 448.95 | 150.15 | 919.24 |

2. The above is an extract of the detailed format of Quarterly Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly Financial Results are available on the websites of the Stock Exchanges and the Company namely www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com

3. The above unaudited financial results of the Company as reviewed by the Audit Committee has been approved by the Board of Directors at its meeting held on August 02, 2019.

By order of the Board
For **Laurus Labs Limited**

Place: Hyderabad
Date : August 02, 2019

**Dr. Satyanarayana Chava**
Whole Time Director & Chief Executive Officer